లో ఓల్టేజ్‌తో రైతులకు కన్నీళ్లు

- కాలిపోతున్న విద్యుత్ మోటార్లు
- రిపేర్ల కోసం వేలల్లో ఖర్చు
- పంటలను కాపాడుకునేందుకు అవస్థలు

రామారెడ్డి: కరెంట్ కష్టాలు యాసంగిలో రైతులకు కన్నీళ్లు పెట్టిస్తున్నాయి. లో ఓల్టేజ్‌తో పాటు ట్రాన్స్‌ఫార్మర్లపై ఓవర్ లోడ్ కారణంగా వ్యవసాయానికి వినియోగించే విద్యుత్ మోటార్లు కాలిపోతున్నాయి. దీంతో వాటి రిపేర్ల కోసం రైతులు వేల రూపాయల ఖర్చు చేయాల్సి వస్తోంది. పంటలను కాపాడుకునేందుకు రైతులు నానా అవస్థలు పడుతుంటే తరుచూ ఓవర్ లోడ్ కారణంగా ట్రాన్స్‌ఫార్మర్లు కలిపోతున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ మోటర్ల రిపేరీ పెద్ద సమస్యగా మారాయి.

యాసంగిలో 4.50 లక్షల ఎకరాలలో వివిధ రకాల పంటలు సాగు చేస్తుండగా ఇందులో 2.60 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. మరో లక్ష ఎకరాల్లో మక్క ఇతర పంటలు వేశారు. జిల్లా అధికారారికంగా 1.05 లక్షల వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. ఎండలు ముదిరేకొద్దీ విద్యుత్ వినియోగం మరింత పెరిగే అవకాశం ఉంది. బారు బావుల సంఖ్య పెరిగినా అందుకు తగట్లు టాన్స్‌ఫార్మన్ పెంచడం లేదు. రైతులు ఓవర్ లోడ్ సమస్యల


విద్యుత్ మోటారును రిపేర్ చేస్తున్న మెకానిక్

కోసం 62 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు ఇవ్వాలని అందు కోసం చెల్లించిన మొత్తానికి డీడీలు ఇచ్చి ఏళ్లు గడిచినా కొత్త మంజూరు చేయడం లేదు. లో ఓల్టేజ్, ఓవర్ లోడ్ సమస్యతో భిక్కనూర్ రాజంపేట, లింగంపేట, రామారెడ్డి, బీబీపేట తదితర మండలాల్లో ఎక్కువ మోటర్లు కాలిపోతున్నాయి. ఆయా మండలాల్లో మోటార్ల రిపేరీ కోసం షాపుల వద్ద రైతులు పదుల సంఖ్యలో వేచి చూస్తుండటం కన్పిస్తోంది.

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి



లో ఓల్టేజి లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి. కాలిపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో వెంటనే కొత్తవి ఏర్పాటు చేయాలి. రైతులపై భారం పడకుండా పాలకులు చర్యలు తీసుకోవాలి.

–ముచ్చు పెద్ద గంగయ్య, రైతు, ఇసన్నపల్లి

రైతుల బాధలు చూడలేక..



రైతుల బాధలు చూడలేకపోతున్నాం. విద్యుత్ మోటార్ల రిపేరీ కోసం వచ్చే రైతుల వద్ద డబ్బులు లేకపోతే పంటలు పండిన తర్వాత రిపేరీకి అయిన ఖర్చు వసూలు చేసుకుంటున్నాం. ఎక్కువ మొత్తం ఆశించకుండా తక్కువ పైసలు తీసుకుంటాం.

–బ్రిండ్లస్వామి, మోటార్ రిపేర్ షాపు, రామారెడ్డి

క్లుప్తంగా

నేడు బాన్సువాడకు రేవంత్‌రెడ్డి రాక

బాన్సువాడ టౌన్: పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సోమవారం బాన్సువాడ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద నిర్వహించనున్న సభకు హాజరు కానున్నారు. ఆదివారం రాత్రి నస్రూల్లాబాద్ మండల కేంద్రంలో బస చేసిన ఆయన కంశెట్‌పల్లి, నెమ్లి, అంకోల్ క్యాంప్, దుర్కి, దేశాయిపేట్, సోమేశ్వర్ మీదుగా బాన్సువాడకు చేరుకోనున్నారు. సభను విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కాసుల బాల్‌రాజ్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. సభకు పెద్ద ఎత్తున ప్రజలను తరలించనున్నారు.

పోస్టాఫీస్ ద్వారా భద్రాద్రి నుంచి తలంబ్రాలు

ఎల్లారెడ్డి: పోస్టాఫీస్ ద్వారా భద్రాద్రి సీతారాముడి కల్యాణ తలంబ్రాలను పొందవచ్చని పోస్టల్ సూపరింటెండెంట్ ఉమామహేశ్వర్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. తలంబ్రాలతో పాటు ప్రసాదం, పసుపు, కుంకుమ అందిస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు సమీప పోస్టాఫీస్‌లో సంప్రదించాలని లేదా eshop.tsposts.in ద్వారా ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి

ఎల్లారెడ్డిరూరల్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ఇంటింటా ప్రచారం చేయాలని బీజేపీ నాయకులు దేవేందర్ కార్యకర్తలకు సూచించారు. ఆదివారం ఎల్లారెడ్డిలో బీజేపీ శక్తి కేంద్రాల ఇంచార్జిలతో ఆయన సమావేశం నిర్వహించారు. బీజేపీ నాయకులు బాలకిషన్, విద్యాసాగర్, ప్రశాంత్‌గౌడ్, సతీష్, రాజేష్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



దోమకొండ: మండలంలోని ముత్యంపేట గ్రామంలో సిమెంట్ రోడ్డు, డ్రైనేజీ పనులను సర్పంచ్ సూర్యప్రకాష్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు శ్రీనివాస్, నక్క రవి, కో ఆప్షన్ సభ్యులు సునీత, నాయకులు స్వామి, మధు పాల్గొన్నారు.

కుంగ్‌ఫూ పోటీల్లో చిన్నారుల ప్రతిభ



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలో కుంగ్‌ఫూ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చూపిన చిన్నారులకు బ్లాక్, బ్రౌన్, ఎల్లో బెల్టులతో పాటు ప్రసంశా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ గ్రాండ్ మాస్టర్ కార్తికేయ, కుంగ్‌ఫూ మాస్టర్ మెయినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ యాత్రకు మద్దతుగా బైక్ ర్యాలీ



తాడ్వాయి: పీసీసీ అధ్యక్షుడు చేపట్టిన పాదయాత్రకు మద్దతుగా మండలంలోని చిట్యాలలో ఆదివారం కాంగ్రెస్ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం అని వారు వెల్లడించారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో మరోసారి కాంగ్రెస్ విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం వాయిదా

కామారెడ్డి టౌన్: బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించనున్న ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని వర్షాల కారణంగా వాయిదా వేశారు. తిరిగి 25న కార్యక్రమం నిర్వహిస్తామని పట్టణ అధ్యక్షుడు జూకంటి ప్రభాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

బోరు మోటారు ప్రారంభం

లింగంపేట: మండలంలోని మాలోత్ తండాలో ఆదివారం గిరిజన నాయకుడు ప్రకాష్‌నాయక్ బోరు మోటారు ప్రారంభించారు. దీంతో గ్రామంలో తాగునీటి సమస్య తీరినట్లేనని పేర్కొన్నారు. జెడ్పీటీసీ శ్రీలత నిధులు మంజూరు చేసినందుకు వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గిరిజన నాయకులు రమేశ్, హరిచంద్, విజేందర్, రవి, కిషన్, సంతోష్, నవీన్, వినోద్, పూర్య, విఠల్ పాల్గొన్నారు.

ప్రశ్నపత్రాల లీకేజీపై విచారణ చేయించాలి


బాన్సువాడలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బాన్సువాడ టౌన్: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అసమర్థతకు నిదర్శనమని కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఖలేక్ ఆరోపించారు. ఈ సందర్భంగా ఆదివారం స్థానిక తాడ్కోల్ చౌరస్తా వద్ద ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగుల జీవితాలతో ఆడుకున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం గద్దె దిగేవరకు పోరాటం చేస్తామని అన్నారు. ప్రశ్నాపత్రాల లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ టీఎస్‌పీఎస్సీ చైర్మన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు మంత్రి గణేష్, మాసాని శేఖర్‌రెడ్డి, కాశీరం, మధుసూదన్‌రెడ్డి, సాయిలు, నార్ల రఘు, షోహేబ్, అజీం, మన్నన్ పాల్గొన్నారు.

కంటి పరీక్షలు చేయించుకోవాలి

సదాశివనగర్: కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ గైని అనసూయ, జెడ్పీటీసీ కమిలి నర్సింలు కోరారు. ఆదివారం మండలంలోని అడ్లూర్‌ఎల్లారెడ్డి గ్రామంలో కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంటి సమస్యలున్న వారు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ పైడి జానకి


కంటి వెలుగును ప్రారంభిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

జనార్దన్, ఉప సర్పంచ్ లక్ష్మీపతి, ఎంపీటీసీలు సంకరి లక్ష్మి రాజలింగం, ఎడ్ల రేణుకా నర్సింలు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

సదాశివనగర్: మండల కేంద్రానికి చెందిన కరట్లపల్లి రాజవ్వ కుటుంబానికి ఆదివారం కుర్మ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కాలభైరవ స్వామి ఆలయ కమిటీ డైరెక్టర్ మర్కంటి బుచ్చన్న ఆర్థిక సహాయంతో పాటు బియ్యం అందజేశారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా రాజవ్వ కుమార్తె ఇటీవల ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. బాధితురాలి కుటుంబ పరిస్థితి గురించి స్థానికులు బుచ్చన్న దృష్టికి తీసుకెళ్లడంతో ఆర్థిక సహాయం చేసేందుకు ఆయన ముందుకొచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బద్దం శ్రీనివాస్‌రెడ్డి, ఉప సర్పంచ్ వంకాయల రవి, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు పెసరి సాయిలు, మాజీ ఎంపీపీ బంజ విజయ శివకుమార్, విండో చైర్మన్ కమలాకర్ రావు, ఏఎంసీ వైస్ చైర్మన్ రాజేందర్, మండల కో ఆప్షన్ మెంబర్ అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.


ఆర్థిక సహాయం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

ఫీల్డ్ అసిస్టెంట్ కుటుంబానికి..

భిక్కనూరు: అనారోగ్యంతో మృతి చెందిన బస్వాపూర్ ఫీల్డ్ అసిస్టెంట్ అంజయ్య కుటుంబానికి మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామానికి చెందిన దివ్యాంగుడైన యాస గంగారెడ్డి రూ. 5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

చెట్ల కొమ్మల తొలగింపు


జేసీబీతో పిచ్చి మొక్కలు తొలగిస్తున్న స్థానికులు

మద్నూర్: డోంగ్లీ మండలంలోని మదన్‌హిప్పర్గాకు వెళ్లే రదారిపై చెట్ల కొమ్మలు ఏపుగా పెరగడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. రోడ్డు పక్కనున్న చెట్ల కొమ్మలను తొలగించాలని సంబంధిత అధికారులకు పలుమార్లు విజ్ఞప్తి చేసినా స్పందించక పోవడంతో చేసేది ఏమీలేక గ్రామస్తులు చందాలు వేసుకొని జేసీబీ ద్వారా వాటిని తొలగించారు.

రోడ్డుకు మోక్షం ఎప్పుడో?


డోంగ్లీ మండలం ఇలేగావ్‌కు వెళ్లె రోడ్డు దుస్థితి

మద్నూర్: డోంగ్లీ మండలంలోని ఇలేగావ్ గ్రామానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉంది. చిన్న వర్షానికే రోడ్డు మొత్తం బురదమయంగా మారడంతో వాహనాల రాకపోకలు ఎలా ఉన్నా కాలినడకన వెళ్లేందుకు కూడా అవకాశం లేకుండా పోయింది. ఇలేగావ్ గ్రామానికి బీటీ రోడ్డు సౌకర్యం లేక స్థానికులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఇలేగావ్ గేటు నుంచి ఇలేగావ్ గ్రామం వరకు ఉన్న 1.5 కిమీ మేర రోడ్డును రిపేరీ చేయించాలని స్థానికులు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు.

కుర్మ సంఘం భవనానికి నిధులు మంజూరు


ప్రొసీడింగ్ ప్రతిని అందజేస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

సదాశివనగర్: మండల కేంద్రంలోని కుర్మ సంఘ భవన నిర్మాణం కోసం ఎమ్మెల్యే జాజాల సురేందర్ రూ. 5 లక్షలు మంజూరు చేశారు. ఇందుకు సంబంధించిన ప్రొసీడింగ్ ప్రతిని కుర్మ సంఘం నేతలకు ఆదివారం బీఆర్‌ఎస్ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బీరయ్య, విండో చైర్మన్ కమలాకర్ రావు, ఏఎంసీ వైస్ చైర్మన్ రాజేందర్, కుర్మ సంఘం ప్రతినిధులు బొంబాయి మల్లయ్య, జోగిని పెద్ద నర్సయ్య, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు పెసరి సాయిలు, నాయకులు గాదారి అశోక్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌ల సమస్యలపై పోరాటం


రేవంత్‌రెడ్డిని కలిసిన పోసానిపేట సర్పంచ్

రామారెడ్డి: పంచాయతీ సర్పంచ్‌ల సమస్యలపై ప్రత్యేకంగా పోరాటం చేయాలని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని కోరినట్లు పోసానిపేట సర్పంచ్ గీరెడ్డి మహేందర్‌రెడ్డి వెల్లడించారు. యాత్ర ఫర్ చేంజ్ పాదయాత్రలో భాగంగా ఆదివారం గాంధారి మండల కేంద్రంలో రేవంత్‌రెడ్డిని కలిసి గ్రామ పంచాయతీల్లో నెలకొన్న సమస్యలను వివరించినట్లు తెలిపారు. మూడు నెలలుగా సఫాయి సిబ్బందికి వేతనాలు ఇవ్వలేని స్థితిలో పంచాయతీలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.

ఎమ్మెల్సీని సన్మానించిన తపస్ నాయకులు


ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డిని అభినందిస్తున్న తపస్ ప్రతినిధులు

కామారెడ్డి టౌన్/ కామారెడ్డి అర్బన్: హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీగా బీజేపీ మద్దతుతో పోటీ చేసి ఇటీవల విజయం సాధించిన ఏవీఎన్ రెడ్డిని ఆదివారం తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్షుడు పుల్గం రాఘవరెడ్డి, ప్రధాన కార్యదర్శి సంతోష్, రాష్ట్ర బాధ్యుడు రవీంద్రనాథ్ ఆర్య, రమేష్‌కుమార్, రాంచంద్రం, భాస్కరాచారి, అంజనేయులు, భాస్కర్, శోభన్‌బాబు, సత్యనారాయణ, ప్రభాకర్, శ్రీనివాస్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గం..

■ **నాయీ బ్రాహ్మణ మండల కార్యవర్గం ఎన్నిక**



తాడ్వాయి: నాయీ బ్రాహ్మణ మండల నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పోశెట్టి, గౌరవ అధ్యక్షుడిగా శంకర్, ప్రధాన కార్యదర్శిగా సదానంద్, ఉపాధ్యక్షులుగా సిద్దయ్య, నరేష్, జాయింట్ సెక్రటరీగా కిషన్, కోశాధికారిగా సాయిలు ఎన్నికయ్యారు.

■ **ముదిరాజ్ సంఘం..**



భిక్కనూరు: మండలంలోని శ్రీసిద్ధరామేశ్వరనగర్ గ్రామ ముదిరాజ్ సదర్ సంఘం కార్యవర్గాన్ని సర్పంచ్ జనగామ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చల్మెడ తిరుమలయ్య, ఉపాధ్యక్షుడిగా పుట్నాల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా రాజంపేట యాదగిరి, కోశాధికారిగా బోయిని సిద్దరాములను ఎన్నుకున్నారు.

■ **మత్తడి పోచమ్మ ఆలయ కమిటీ..**

లింగంపేట: మండల కేంద్రానికి చెందిన మత్తడిపోచమ్మ ఆలయ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. వారం రోజుల పాటు నిర్వహించనున్న ఉగాది ఉత్సవాలను దిగ్విజయం చేసేందుకు అన్ని కుల సంఘాలకు కమిటీలో చోటు కల్పించారు. అధ్యక్షుడిగా బొల్లారం సాయన్న, ఉపాధ్యక్షులుగా సుప్పాల సాయిలు, చేపూరి పోశెట్టి, ప్రధాన కార్యదర్శి దూరిశెట్టి అశోక్, కార్యదర్శి కొడ శ్రీనివాస్, కోశాధికారి మంద కిష్టయ్య, ముఖ్య సలహాదారులు ముదాం సాయిలు, కమ్మరి వెంకటేశం, ఆకుల సత్యనారాయణ, పారిపల్లి సురేష్, శెట్పల్లి సత్యనారాయణ, బ్రాహ్మణ సంఘం శంకర్ పంతులుతో పాటు పలువురి సభ్యులను ఎన్నుకున్నారు.

■ **బీఆర్‌ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడిగా నియామకం**


విలాస్


మద్నూర్: బీఆర్‌ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడిగా డోంగ్లీ మండలం పెద్ద టాక్లీ గ్రామానికి చెందిన గాయక్‌వాడ్ విలాస్‌ను నియమించారు. బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు.

■ **మున్నూరు కాపు సంఘం..**



కామారెడ్డి రూరల్: దేవునిపల్లి మున్నూర్ కాపు సంఘం అధ్యక్షుడిగా కానుకుంట గోవర్ధన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభాలో మున్నూర్ కాపులు మొదటి స్థానంలో ఉన్నా రాజకీయ నాయకులు కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తున్నారని పేర్కొన్నారు. అందరం ఐక్యంగా ఉండి రాజకీయంగా ఎదగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మామిండ్ల అంజయ్య, సరంపల్లి మాజీ సర్పంచ్ రాజు, రాజలింగం, రిటైర్డ్ తహసీల్దార్ ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

■ **పెరిక సంఘం అధ్యక్షుడిగా నియామకం**



కామారెడ్డి టౌన్: పెరిక సంఘం జిల్లా అధ్యక్షుడిగా కుంచాల శేఖర్, ప్రధాన కార్యదర్శిగా కొండ్ల భాస్కర్ ఎన్నికయ్యారు. అనంతరం వారికి నియామకపత్రాలు అందజేశారు.

ఆధ్యాత్మికం

■ **ఘనంగా శ్రీనివాస కల్యాణోత్సవం**


కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

కామారెడ్డి అర్బన్: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో 111వ శ్రీనివాస కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా పేర్లు నమోదు చేసుకున్న దంపతులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు.

■ **వెల్లివిరిసిన మతసామరస్యం**

బాన్సువాడ రూరల్: మండలంలోని చిన్న రాంపూర్ గ్రామానికి చెందిన ముస్లిం మైనార్టీ యువకుడు షేక్ అజీజ్ ఆదివారం హనుమాన్ మాలధారుల స్వాములకు భిక్ష ఏర్పాటు చేసి మతసామరస్యాన్ని చాటుకున్నారు. అంతకు ముందు హనుమాన్ మందిరంలో స్వాములు ప్రత్యేక పూజలు చేశారు. కుల, మతాలకు అతీతంగా భిక్ష ఏర్పాటు చేసిన షేక్ అజీజ్‌ను స్థానికులు అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఈశ్వరీరేఖ, ఉప సర్పంచ్ అజీమ్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, కుర్మవిఠల్, కుర్మ గణేష్, శ్రీకాంత్, అంజయ్య పాల్గొన్నారు.


స్వాములకు భిక్ష ఏర్పాటు చేసిన షేక్ అజీజ్

■ **హనుమాన్ ప్రవచనం..**


ప్రవచనంలో పాల్గొన్న హనుమాన్ భక్తులు

నస్రుల్లాబాద్: మండలంలోని మైలారం గ్రామంలో ఆదివారం హనుమాన్ స్వాములు మండల భిక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. బైక్ ర్యాలీ ద్వారా లింగేశ్వర గుట్ట ఆశ్రమం పీఠాధిపతి పిట్లకష్ణ మహారాజ్‌కు స్వాగతం పలికారు. అనంతరం ఆయన భక్తలను ఉద్దేశించి మాట్లాడారు.

■ **సప్తాహం కార్యక్రమంలో ఎమ్మెల్యే..**


చిల్లర్గి హనుమాన్ ఆలయంలో ఎమ్మెల్యే హన్మంత్ సింధే

పిట్లం: మండలంలోని చిల్లర్గి గ్రామం హనుమాన్ ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా ఆదివారం నిర్వహించిన సప్తాహ కార్యక్రమంలో ఎమ్మెల్యే హన్మంత్ సింధే, మండల బీఆర్‌ఎస్ నాయకులు నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆలయంలో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వాసరి రమేష్, నాయకులు విజయ్, ప్రతాప్ రెడ్డి, సర్పంచ్ రమేష్ పాల్గొన్నారు.

దరఖాస్తు స్వీకరణకు నేటితో గడువు పూర్తి

బాన్సువాడ రూరల్: గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకునేందుకు సోమవారంతో గడువు పూర్తవుతుందని బోర్లంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపల్ పద్మకుమారి తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు వచ్చే నెల 23న అర్హత పరీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా

ఎల్లారెడ్డిరూరల్: విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించి విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ సత్యనారాయణ తెలిపారు.

హైమాస్ట్ లైట్ల ప్రారంభం


హైమాస్ట్ లైట్లను ప్రారంభించిన ఎంపీటీసీ

మాచారెడ్డి: మండలంలోని అంతంపల్లి గ్రామంలో మాచారెడ్డి ఎంపీటీసీ వినోద భర్త రావుల ప్రభాకర్ తల్లిదండ్రులు రాజవ్వ, చంద్రయ్య జ్ఞాపకార్థం రూ. 1.55 లక్షలతో ఏర్పాటు చేసిన హై మాస్ట్‌లైట్లు ప్రారంభించారు. అదేవిధంగా పెద్దమ్మ ఆలయం వద్ద బోరు మోటారును ఏర్పాటు చేశారు.

పీసీసీ అధ్యక్షుడి దిష్టిబొమ్మ దహనం


రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

కామారెడ్డి టౌన్: ప్రభుత్వ విప్ గంప గోవర్దన్‌పై చేసిన వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ యువజన విభాగం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక నిజాంసాగర్ చౌరస్తాలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం రేవంత్ రెడ్డితో పాటు మాజీ మంత్రి షబ్బీర్ అలీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యువజన విభాగం పట్టణ అధ్యక్షుడు బానుప్రసాద్, నాయకులు అగ్గి రవీందర్, మాజిద్ పాల్గొన్నారు.